

ఎటూ 'పాలు'పోవడం లేదు..
విజయ డెయిరీ నుంచి ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలతో పాటు ప్రజలకు పాలు, పాల పదార్థాల సరఫరా నిలిచిపోయింది. 8లో



విభిన్న రూపాయ.. వినాయకా!
వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని పలుచోట్ల ఆకట్టుకునే రూపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడి ప్రతిమలు భక్తుల పూజలందుకుంటున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలుప్రాంతాల్లో మధ్యాహ్నం తర్వాత ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వచ్చేనెల 16 నుంచి 'ఓపెన్' పరీక్షలు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్‌మీడియట్ అభ్యర్థులకు వచ్చేనెల 16 నుంచి 26వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. పరీక్షలు నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే, ఇంటర్ అభ్యర్థులకు ప్రాక్టికల్ పరీక్షలు వచ్చే నెల 30 నుంచి నవంబర్ 6వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంకితభావంతో పాటు అప్రమత్తంగా విధులు



ఉద్యోగుల హాజరును పరిశీలిస్తున్న నాగభూషణం

సత్తుపల్లిటౌన్: అటవీ సంరక్షణ విషయంలో ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూనే నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ చీఫ్ కన్జర్వేటర్, భద్రాద్రి జోన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎం.నాగభూషణం సూచించారు. సత్తుపల్లిలోని ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో గురువారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా రేంజ్ పరిధిలోని అటవీ ఉద్యోగుల స్థానికతను తనిఖీ చేసిన ఆయన, ఉద్యోగులు తప్పనిసరి స్థానికంగానే ఉండాలని స్పష్టం చేశారు. ఆతర్వాత సత్తుపల్లి రేంజ్‌లోని అర్బన్ పార్క్, చంద్రాయిపాలెం ప్లాంటేషన్లను కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారులు సందీప్, పి.స్నేహలత, డీఆర్‌ఓ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం



ఆస్పత్రి వద్ద పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

సత్తుపల్లిటౌన్: సీజనల్ వ్యాధుల నేపథ్యాన ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు సూచించారు. సత్తుపల్లి ఏరియా ప్రభుత్వాస్పత్రిని గురువారం సందర్శించిన ఆయన వైద్యులతో సమీక్షించారు. అనంతరం కిష్టారం నర్సింగ్ కళాశాల భవనం, సత్తుపల్లిలో రూ.35 కోట్లతో నిర్మిస్తున్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు ఎస్.కిరణ్‌కుమార్, వి.స్రవంతి, శివకృష్ణతో పాటు విజయలక్ష్మి, ఎ.హైమావతి పాల్గొన్నారు.

ఖమ్మం రెండో అదనపు మెజిస్ట్రేట్‌గా బిందుప్రియ

ఖమ్మం లీగల్: ఖమ్మం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఏపూరి బిందుప్రియ నియమితులయ్యారు. ఆమె స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా జి.కొండూరు మండలం కందులపాడు గ్రామం. అలాగే, ఖమ్మం ప్రత్యేక సంచార న్యాయస్థానం న్యాయమూర్తిగా విజయవాడకు చెందిన బెక్కం రజనిని నియమిస్తూ తెలంగాణ హైకోర్టు నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జిల్లాలో 12.1 మి.మీ. వర్షపాతం



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో సగటున 12.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం రాత్రి జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈమేరకు బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా నేలకొండపల్లి మండలంలో 27.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా బోనకల్ మండలంలో 22.4, మధిర మండలంలో 20.4, సింగరేణి మండలంలో 20.2, కూసుమంచి మండలంలో 17.8, రఘునాథపాలెం, పెనుబల్లి మండలాల్లో 15.4, సత్తుపల్లి మండలంలో 14.8, వేంసూరు మండలంలో 14.4, వైరా మండలంలో 13.8, ఎర్రుపాలెం మండలంలో 13, చింతకాని మండలంలో 11.6 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. కాగా, మరో నాలుగు రోజుల పాటు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పత్తి పంటతో పాటు మెట్ట పైర్లు, ఉద్యాన పంటలకు ప్రయోజకరంగా మారాయి.

ఆమెకు కానుక!





చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించడంతో చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం మరింతగా పెరగనుంది. ఏళ్ల నిరీక్షణ అనంతరం బిల్లు ఆమోదంపై జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాల్లోని మహిళల్లో హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఇటు ఓటర్ల పరంగా.. అటు జనాభా ప్రాతిపదికన చూసినా మహిళలే అధికసంఖ్యలో ఉన్నారు. ఫలితంగా 33శాతం రిజర్వేషన్‌తో చట్టసభల్లో అతివలకు మరిన్ని అవకాశాలు దక్కనున్నాయి. ఇప్పటికే జిల్లాలో గత కొన్ని దశాబ్దాలుగా మహిళలు ప్రజాప్రతినిధులుగా, రాజకీయ నేతలుగా రాణిస్తున్నారు. అయితే మహిళలు మరింత మంది చట్టసభల్లో అడుగు పెట్టేందుకు ఈ బిల్లు ద్వారా అవకాశం కలగనుంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

జిల్లా జనాభా, ఓటర్లలో మహిళలే అధికం
- ఓటర్లలో 6.04లక్షలు, జనాభాలో 7.62లక్షలకు పైగానే...
- అన్ని నియోజకవర్గాల్లోనూ వారిదే ఆధిపత్యం
- మహిళా రిజర్వేషన్ ఆమోదంతో హర్షాతిరేకాలు
- చట్టసభల్లో పెరగనున్న మహిళల ప్రాతినిధ్యం

రాణిస్తున్న మహిళలు
అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లోనూ జిల్లా మహిళలు రాణిస్తున్నారు. సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లు, కార్పొరేటర్లుగా, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్, జెడ్పీటీసీ, ఎంపీటీసీలుగా తమ సత్తా చాటుతున్నారు. రాజకీయ రంగంలో ప్రజాసేవకు అంకితమైన మహిళామణులు.. రిజర్వేషన్ అమలుతో శాసనసభ్యులుగా, ఎంపీలుగా కూడా సేవ చేసే అవకాశం లభించింది. ఖమ్మం మేయర్‌గా, మధిర మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మహిళలే కొనసాగుతున్నారు. అలాగే, జిల్లాలోని 20 మంది జెడ్పీటీసీలకు గాను తొమ్మిది మంది, 20 మండలాలకు గాను 13మంది మహిళలు ఎంపీపీలుగా ఉన్నారు. అలాగే, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో 60 కార్పొరేటర్ల స్థానాలకు గాను 36మంది, సత్తుపల్లి, వైరా, మధిరల్లో 65మంది కౌన్సిలర్లకు గాను 8మంది మహిళలు కొనసాగుతుండడం విశేషం.

అవకాశాలు అంతంతే..
ప్రస్తుతం స్థానిక సంస్థల్లోనే రిజర్వేషన్లు అమలవుతుండగా, తాజాగా ఆమోదించిన రిజర్వేషన్ బిల్లుతో మహిళలు మరింత ముందుకు వెళ్లేందుకు ఆస్కారం ఏర్పడింది. ఇప్పటి వరకు రిజర్వేషన్లు లేక రాజకీయ పార్టీలు మహిళలకు చట్టసభల్లో అంతగా ప్రాధాన్యత కల్పించడం లేదనే అపవాదు ఉంది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి ఎదురవుతోంది. ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోక్షం లభించడం, అన్ని పార్టీలు మద్దతు తెలిపిన నేపథ్యాన మహిళామణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మెజార్టీ మహిళలే..
జిల్లాలో ఓటర్ల పరంగా.. జనాభా పరంగా మహిళలే అగ్రస్థానంలో ఉన్నారు. అయినప్పటికీ జనాభా ప్రాతిపదికన వారికి అవకాశాలు లభించడం లేదు. జిల్లాలో ఇటీవల ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 11,77,687 మంది ఉండగా.. ఇందులో పురుషులు 5,73,406 మంది, మహిళలు 6,04,203 మంది, ఇతరులు 78 మంది ఉన్నారు. జిల్లా జనాభా అనధికారిక అంచనా ప్రకారం 15,20,778 మంది కాగా, ఇందులో మహిళలు 7,62,229 మంది, పురుషులు 7,58,549 మంది ఉన్నారు.

కీలకం కానున్న మహిళల పాత్ర



చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయడంతో మహిళలకు మెరుగైన అవకాశాలు లభిస్తాయి. రాజకీయ రంగంలో రాణించే శక్తి మహిళలకు ఉంది. ఈ బిల్లుతో భవిష్యత్ రాజకీయాల్లో అతివల పాత్ర కీలకం కానుంది. మహిళలు అంది వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని సత్ఫలితాలు సాధిస్తారు.

– పునుకొల్లు నీరజ, మేయర్, కేఎంసీ

ఈసారే అమలు చేయాలి



మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం ఆనందంగా ఉంది. అయితే, తాజాగా ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో తక్షణమే రిజర్వేషన్లు అమలుచేయాలి. అలాకాకుండా సాంకేతిక కారణాలతో సాగదీస్తే ఫలితం ఉండదు. ఈ అంశంలో కేంద్రం చిత్తశుద్ధితో కృషి చేస్తే మహిళలు మరింతగా రాణిస్తారు.

– బానోతు చంద్రావతి, మాజీ ఎమ్మెల్యే, వైరా

పోరాటం ఫలించింది ..



చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్తంగా మహిళలు చేస్తున్న పోరాటం ఫలించింది. ఈ అంశంపై పోరాడిన ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు. చట్టసభల్లోకి మహిళలను పంపేందుకు అన్ని పార్టీలు చొరవ చూపాలి. ప్రజల మన్ననలు పొందే వారికి ఆ దిశగా అవకాశం కల్పిస్తే అందరికీ మంచి జరుగుతుంది.

– దోరేపల్లి శ్వేత, ఖమ్మం మార్కెట్ చైర్‌పర్సన్

సత్తా చాటేందుకు మంచి తరుణం



మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం గొప్ప నిర్ణయం. ఉద్యోగాలు, పథకాల్లో కాకుండా చట్టసభల్లోనూ రిజర్వేషన్ అమలుతో గొప్ప అవకాశం ఇచ్చినట్లవుతుంది. ఎక్కువ మంది మహిళలకు అవకాశం లభిస్తే సుపరిపాలన సాధ్యమవుతుంది. మహిళల సత్తా చాటేందుకు ఇది మంచి తరుణం.

– మాలోత్ ప్రియాంక, రఘునాథపాలెం జెడ్పీటీసీ

30న మంత్రి కేటీఆర్ రాక



ఖమ్మంలో కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పించిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, తదితరులు

- రూ.1,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వెల్లడించిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చినన్ని నిధులు రాష్ట్రంలోని ఏ మున్సిపాలిటీకీ రాలేదని... ఇది పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చొరవతోనే సాధ్యమైందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మం 16 19వ డివిజన్లలో రూ.1.60కోట్లతో చేపట్టే డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న మంత్రి కేటీఆర్ ఖమ్మం రానున్నారని, రూ.1,200 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఎవరో గ్యారంటీ కార్డులు ఇస్తామంటున్నారని... వారిని నమ్మితే మళ్లీ గతంలో మాదిరి పరిస్థితులు ఎదురవుతాయని చెప్పారు. ఎవరి గ్యారంటీ తెలంగాణ ప్రజలకు అవసరం లేదని, ఇప్పుడున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీ చాలని స్పష్టం చేశారు. కాగా, దుర్భరమైన పరిస్థితిలో ఉన్న ఖమ్మంను అద్భుతంగా తీర్చిదిద్దామని, ఇంతలా అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు తనను సాదుకుంటారో.. సంపుకుంటారో ప్రజల చేతుల్లోనే ఉందని మంత్రి చెప్పారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి ఖమ్మం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఒక రూపు తీసుకొచ్చానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, కార్పొరేటర్లు చామకూరి వెంకన్న, మేడారపు వెంకటేశ్వర్లు, దండా జ్యోతిరెడ్డి, అధికారులు కృష్ణలాల్, రంజిత్, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, దేవబక్తుని కిషోర్‌బాబు, కొల్లు పద్మ, బిచ్చాల తిరుమలరావు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి
మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించారు. ఖమ్మం లకారం ట్యాంక్ బండ్‌పై ఉన్న బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. బాపూజీ జీవితాంతం ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడారని, తొలి, మలిదశ ఉద్యమంలో ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.



రాంక్యా తండాలో మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, జెడ్పీటీసీ ప్రియాంక తదితరులు

మీకే గ్యారంటీ లేదు...
రఘునాథపాలెం: కాంగ్రెస్ నాయకులు దండాలు పెట్టుకుంటూ వస్తున్నారు... వారికే గ్యారంటీ లేకున్నా గ్యారంటీ కార్డుల పేరిట ప్రజలను మభ్యపెడుతున్నారని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. ఆ పార్టీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో రూ.4.40 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేయడంతో పాటు పూర్తయిన వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంక్యా తండాలో జరిగిన సభలో పువ్వాడ మాట్లాడుతూ అమలు చేయలేని గ్యారంటీ కార్డులను ప్రకటించిన కాంగ్రెస్ నేతలు, గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో చెప్పాలని సూచించారు. తండాలను పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేసి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామస్తులకు పాలించుకునే అధికారాన్ని కల్పించిందని తెలిపారు. మండలంలో 12 లింక్ రోడ్ల నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేశామని, అభివృద్ధి ఆగిపోవద్దనుకుంటే బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, జెడ్పీటీసీ ప్రియాంక, ఎంపీపీ గౌరి, సర్పంచ్‌లు కాంతి, అమలి, సుగుణ, మెంటెం రామారావు, ప్రదీప్, బాలాజీతో పాటు అఫ్జల్, మందడపు నర్సింహారావు, సుధాకర్, లక్ష్మణ్ నాయక్, కొంటెముక్కల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి..



మధిర : ఖమ్మంపాడులో ఉపాధ్యాయులు, గ్రామస్తులను అభినందిస్తున్న కలెక్టర్ గౌతమ్

- విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి
- పాఠశాల భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్

మధిర: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.98 లక్షలతో నిర్మించిన మండలంలోని ఖమ్మంపాడు ప్రాథమికోన్నత పాఠశాల నూతన భవనాన్ని గురువారం ఆయన జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అన్నిచర్యలు చేపడుతోందని తెలిపారు. నూతన భవనాలు నిర్మిస్తుండడమే కాక వసతులు కల్పించినందున విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామంతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కాగా, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆర్థిక సహకారంతో పాఠశాల భవనానికి స్థలాన్ని సేకరించగా.. ఇందుకు రూ.50వేల విరాళం అందజేసిన ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. ఆ తర్వాత డంప్ యార్డు వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీసీసీబీ వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ లలిత, సర్పంచ్ డి.రుక్మిణమ్మ, డీఈఓ సోమశేఖర శర్మ, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, ఎంఈఓ ప్రభాకర్, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం ఎస్.కే.నాగుల్‌మీరా, ఎంపీటీసీ సామినేని సురేష్, ఉపాధ్యాయులు టి.కృష్ణారెడ్డి, ఎస్.కే.మదార్‌సాహెబ్, కె.శ్రీనివాసరావు, ఆర్.బ్రహ్మారెడ్డి, కె.సునీత, సీహెచ్.జ్యోతి పాల్గొన్నారు.



అలుగు పారుతున్న చెరువు!

నేలకొండపల్లి: జిల్లా అంతటా అప్పుడప్పుడు వర్షాలు పడుతున్నా మిగతా సమయాల్లో ఎండ తీవ్రతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కానీ బుధవారం రాత్రి కురిసిన వర్షంతో పాటు సాగర్ జలాల రాకతో మండలంలోని చెరువుమాధారం చెరువు అలుగు పారుతోంది. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. చెరువు అలుగు పోస్తుండగా చూడడానికి చెరువుమాధారం, మంగాపురంతండా, రాయగూడెం, రాజారాంపేట గ్రామాల ప్రజలు వస్తుండడంతో సందడి నెలకొంది.

కేంద్ర రైల్వే మంత్రితో ఎంపీ రవిచంద్ర భేటీ

ఖమ్మం స్టేషన్‌లో రైళ్ల హాల్టింగ్‌కు వినతి



కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: తమిళనాడు, బిహార్ వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఖమ్మం రైల్వేస్టేషన్‌లో తమిళనాడు, గయామాస్ సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఈసందర్భంగా గురువారం ఆయన పార్లమెంట్‌లో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఖమ్మం చుట్టుపక్కల ఉన్న వందలాది గ్రానైట్ పరిశ్రమలు, క్వారీల్లో తమిళనాడుకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. అలాగే, బిహార్ కూలీలు పనిచేస్తున్నందున స్వస్థలాలకు వెళ్లేందుకు విజయవాడ, వరంగల్ నుంచి బయలుదేరాల్సి వస్తోందని చెప్పారు. ఈమేరకు ఖమ్మంలోనే రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. అలాగే, ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ డిస్ట్రిబ్యూటర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర పెట్రోలియం, సహజ వనరుల శాఖ మంత్రి హరిదీప్ సింగ్ పూరీకి ఎంపీ వినతిపత్రం అందజేశారు. ఎంపీ వెంట ఎల్‌పీజీ డీలర్ల సంఘం తెలంగాణ, ఏపీ అధ్యక్షులు కె.జగన్‌మోహన్ రెడ్డి, సుమనశేఖర్, మాజీ అధ్యక్షుడు మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మహిళలకు సముచిత గౌరవం
భారతీయ సంస్కృతిలో మహిళలకు ప్రత్యేక స్థానం, గౌరవం ఉందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మహిళా బిల్లు ఆమోదం సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో ఎంపీ మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రవేశపెట్టిన బిల్లును బీఆర్ఎస్ స్వాగతిస్తోందని, ఈ నిర్ణయాన్ని త్వరలో జరగనున్న ఎన్నికల్లోనే అమలు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించొద్దు



కేజీబీవీలో కోడిగుడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఎర్రుపాలెం: అభివృద్ధి నాణ్యతగా జరిగేలా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, ఎవరు అలసత్వం వహించినా సహించేది లేదని కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. మండలంలోని బనిగండ్లపాడులో గురువారం కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాలలను తనిఖీ చేయడంతో పాటు బనిగండ్లపాడులో రూ.1.60 కోట్లతో నిర్మిస్తున్న పీహెచ్‌సీ భవన పనులపై ఆరా తీశారు. పనులు వేగంగా చేపట్టడమే కాక నాణ్యత పాటించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీకి వెళ్లిన కలెక్టర్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. విద్యాబోధన, వసతులపై పాఠశాల సూపరింటెండెంట్ సరితతో చర్చించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించిన కలెక్టర్... కోడిగుడ్ల బరువు, నాణ్యతను పరిశీలించారు. అలాగే, కేజీబీవీ కళాశాల భవనానికి విద్యుత్ సౌకర్యం మెరుగుపడేలా వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆతర్వాత విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఈఓ సోమశేఖరశర్మ, తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంఈఓ ప్రభాకర్, ఏడీఈ అనురాధ, సర్పంచ్‌లు మొగిలి అప్పారావు, జంగా పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంబీఏ చివరి విడత ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్: ఐసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఎంబీఏలో ప్రవేశాలు కల్పించేందుకు చివరి విడత దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం మొదలవుతుందని ఖమ్మంలోని కేయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్ తెలిపారు. శుక్రవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశముండగా, అభ్యర్థులు తమ కళాశాల (కేయూ కేహెచ్‌ఎస్ఎఫ్)ను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు కళాశాలలో కానీ 99122 63863, 944065 2571 నంబర్లలో కానీ సంప్రదించాలని సూచించారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు...
కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎంఏ ఇంగ్లిష్, ఎకనామిక్స్, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన కామన్ పీజీ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 23వ తేదీ నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్ ఇచ్చే అవకాశముండగా, తమ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 98492 50633 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

డీఎంఈ పరిధిలోకి జిల్లా ఆస్పత్రి

ఖమ్మం వైద్యవిభాగం: ఇప్పటివరకు వైద్యవిధాన పరిషత్‌లో కొనసాగుతున్న ఖమ్మం జిల్లా ఆస్పత్రి డీఎంఈ(డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) పరిధిలోకి వెళ్లింది. ఈమేరకు ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఇక నుంచి డీఎంఈ పరిధిలో విధులు నిర్వర్తించనున్నారు.

క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ బాధ్యులు



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) బి.సత్యప్రసాద్‌ను టీఎన్జీవోస్ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అఫ్జల్ హసన్, ఆర్.వీ.ఎస్.సాగర్ తదితరులు అదనపు కలెక్టర్‌ను గురువారం కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు జీ.ఎస్.ప్రసాదరావు, భాస్కర్, బుద్దా రామకృష్ణ, హబీబ్, యూసఫ్ అహ్మద్, నరేష్, వై.శ్రీనివాసరావు, దేవేందర్, శాబాసు జ్యోతి, శివస్వప్న, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

31మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు



చెక్కులు అందుకున్న వారితో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫారసుతో 31 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఖమ్మంలో అందజేశారు. ఎంపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రూ.14,45,500 విలువైన చెక్కులను రైతుబంధు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు అందజేశాక మాట్లాడారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంతో ఎంపీ నామ ముందు నిలుస్తారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతీ కుటుంబానికి ఏదో పథకం రూపంలో లబ్ధి చేకూరినందున వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకమేడల సత్యనారాయణ, చిత్తారు సింహాద్రి యాదవ్, వంకాయలపాటి లచ్చయ్య, మాధవి కిరణ్, ధనియాకుల వీరాస్వామి, పాపారావు, సామాజిక వేత్త శేషయ్య, చీకటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో జిల్లా కవులు

ఖమ్మంగాంధీచౌక్: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన గురువారం ప్రపంచశాంతి కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఇందులో ఖమ్మం నగరానికి చెందిన కవులు సాధనాల వెంకటస్వామి నాయుడు, లెనిన్ శ్రీనివాస్, గుడిసె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వినిపించిన కవితలకు నిర్వాహకుల నుంచి ప్రశంసలు దక్కాయి.

రేపు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్: ప్రైవేట్ రంగంలో ఉపాధి కోసం ఆసక్తి ఉన్న జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం ఈనెల 23వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. టేకుపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జరిగే ఇంటర్వ్యూలో 150మందిని బజాజ్ అలియెంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ బాధ్యులు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 45 లోపు వయస్సు కలిగి ఆసక్తి ఉన్న వారు అన్ని సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

కొనసాగుతున్న అండర్-16 క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-16 క్రికెట్ టోర్నీ కొనసాగుతోంది. ఈసందర్భంగా గురువారం ఖమ్మం - వైరా జట్లు తలపబడగా, ఖమ్మం జట్టు ఆరు పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా, లీగ్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతుండగా, తర్వాత నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు టోర్నీ నిర్వాహకులు ఫారూఖ్ తెలిపారు.

రహదారుల అభివృద్ధికి రూ.17.60 కోట్లు

వైరా : వైరా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రహదారుల నిర్మాణానికి రూ.17.60 కోట్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ వినతి మేరకు నిధులు కేటాయిస్తూ గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జూలూరుపాడు మండలం అనంతారం నుండి నల్లబోడు తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.50 కోట్లు, తవిసిగుట్ట నుంచి మాచినేని పేట తండా వరకు రూ.కోటి, బోజ్యాతండా(వెనుక తండా) నుంచి రాజారావుపేట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి వెచ్చిస్తారు. అలాగే, కొణిజర్ల మండలంలో పీడబ్ల్యూడీ రోడ్డు నుండి లాలాపురం మీదుగా శాంతినగర్ ఎస్టీ కాలనీ వరకు రూ. 4.10 కోట్లతో బీటీ రోడ్డు, ఏన్కూరు మండలంలో హిమామ్‌నగర్ నుంచి భద్రుతండా వరకు రోడ్ల అభివృద్ధికి రూ.3.50 కోట్లు, సింగరేణి మండలంలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.3.50 కోట్లు నిధులు మంజూరయ్యారని ఎమ్మెల్యే రాములునాయక్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈమేరకు నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విభిన్న రూపాయ.. వినాయకా!

పసుపు కావొచ్చు.. మట్టి ముద్ద కావొచ్చు ఏది అందుబాటులో ఉన్నా సరే వినాయకుడి ప్రతిమను తీర్చిదిద్ది పూజించినా చాలు కోరిన కోర్కెలు నెరవేరుస్తాడని భక్తుల నమ్మిక. ఇందులో భాగంగా భక్తులు ప్రతిష్ఠించే భారీ విగ్రహాలను సైతం ఆకట్టుకునేలా వివిధ రూపాల్లో తీర్చిదిద్దడం ఆనవాయితీగా వస్తోంది. ఖమ్మంలో భక్త మండలుల ఆధ్వర్యాన ప్రతిష్ఠించిన విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటుండగా పూజలు కొనసాగుతున్నాయి. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్




మిర్చి మార్కెట్ వద్ద శివపార్వతి, కుమారస్వామితో వినాయకుడు →



కృష్ణుడి అవతారంలో రాధతో వినాయకుడు



ప్రకాష్‌నగర్‌లో నంది, శివుడితో గణనాథుడు



బోస్‌బొమ్మ సెంటర్‌లో రామలక్ష్మణులతో గణపయ్య



జహీర్‌పురతండాలో గజరాజులతో వినాయకుడు



కృష్ణుడి గుడివద్ద శివుడి అవతారంలో విఘ్నేశ్వరుడు

బ్రోచర్లు ఆవిష్కరించిన జిల్లా న్యాయమూర్తి

ఖమ్మంలీగల్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన వచ్చేనెల 1వ తేదీన 'రాజ్యాంగం -ప్రజలు' అంశంపై సెమినార్ జరగనుంది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ సదస్సు బ్రోచర్లను గురువారం జిల్లా జడ్జి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లమల నవీన్‌చైతన్య, చింతనిప్పు వెంకట్ మాట్లాడుతూ సెమినార్‌కు న్యాయవాదులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.కృష్ణారావు, ఎం.బసవయ్యతో పాటు కె.రాజశేఖర్‌రెడ్డి, డి.సుధాకర్‌రావు, చల్ల శంకర్, కొల్లి సత్యనారాయణ, మండడపు శ్రీనివాసరావు, టి.పాపయ్య, వి.లక్ష్మీనారాయణ, రామలక్ష్మి, పి.శ్రీలక్ష్మి, భార్గవి, క్రాంతికుమారి, వై.నాగేశ్వరావు, కిషోర్, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లు విడుదల చేసిన జిల్లా జడ్జి, తదితరులు

దృష్టి మరల్చేందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు

ఖమ్మంమయూరిసెంటర్: మణిపూర్ మారణకాండను మరిపించడంతో పాటు మహిళల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిందని, ఇది కేవలం ఎన్నికల కోసమేనని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి విమర్శించారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో గురువారం జరిగిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ తొమ్మిదన్నరేళ్ల బీజేపీ పాలనలో మహిళలు గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో మహిళల ఓట్లు రాబట్టేందుకు హడావుడిగా బిల్లు తీసుకొచ్చారన్నారు. అనేక లోపాలు ఉన్న నేపథ్యాన మహిళలకు జరిగే లాభమేమీ ఉండదని తెలిపారు. కాగా, అక్టోబర్ 5న ఢిల్లీలో జరిగే నిరసన ర్యాలీలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బుగ్గవీటి సరళ, మెరుగు రమణ, అఫ్రోజ్ సమీనా, నాగసులోచన, మెహరున్నీసాబేగం, ప్రభావతి, అజిత, బండి పద్మ, మాచర్ల భారతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

అటవీశాఖకు అప్పగించిన భూముల పరిశీలన

కారేపల్లి: సింగరేణి మండలంలోని ప్రభుత్వ సీలింగ్ భూములను అటవీశాఖకు అప్పగించిన నేపథ్యాన ఖమ్మం ఆర్‌డీఓ జి.గణేష్ గురువారం పరిశీలించారు. సింగరేణి, ఉసిరికాయలపల్లి గ్రామాల రెవెన్యూ పరిధిలోని అప్పాయిగూడెం, గుట్టకింది గుంపు, ఉసిరికాయలపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూములు 113 ఎకరాలను కారేపల్లి ఫారెస్టు రేంజ్‌కు అప్పగించారు. ఈ భూములను పరిశీలించిన ఆర్‌డీఓ... గాంధీనగర్ సమీపాన ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్ అనుమతులను తనిఖీ చేశారు. ఆతర్వాత సింగరేణి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. సింగరేణి తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్, ఆర్ఐ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్ అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ గణేష్

26న చాకలి ఐలమ్మ జయంతి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 26న ఖమ్మంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ ఫ్రంట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కే.వీ.కృష్ణారావు, చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు కొత్తకొండ్ల శ్రీలక్ష్మి వెల్లడించారు. ఈ సందర్భంగా పాత కలెక్టరేట్ ఎదరుగా చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి ఏర్పాట్లను గురువారం వారు పరిశీలించి మాట్లాడారు. జయంతి సభకు మేధావులు, ప్రజాస్వామికవాదులు, సామాజిక ఉద్యకారులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ వెంకటప్పయ్య, సట్టు వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, దుంపటి నగేష్, సట్టు సతీష్‌బాబు, జక్కుల రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

● గణనాథుడి నిమజ్జనం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న స్విమ్మర్లు

మధిరరూరల్: మధిర సిమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని గురువారం పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. తొలుత పట్టణంలో భారీ ఊరేగింపు చేపట్టగా, చెరువులో తెప్పోత్సవం నిర్వహించాక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కాగా, వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని వ్యాపారి తూములూరి రాజా రూ.15 వేలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డితో పాటు పల్లపోతు ప్రసాదరావు, శ్యాం, లింగంపల్లి అప్పారావు, ఉప్పెల సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి రేపు స్పాట్ కౌన్సెలింగ్

పాల్వంచరూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 23వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గురుకులాల ఖమ్మం రీజియన్ ఆర్‌సీఓ ప్రత్యూష తెలిపారు. ఏప్రిల్‌లో నిర్వహించిన బ్యాక్‌లాగ్ ప్రవేశపరీక్షలో పాల్గొన్న ఎస్సీ విద్యార్థులు మాత్రమే అర్హులని, సొంతంగా పనులు చేసుకోలేని దివ్యాంగులైన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈమేరకు ఖమ్మంలోని అంబేద్కర్ జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం పది గంటలకు మొదలయ్యే కౌన్సెలింగ్‌కు ప్రవేశపరీక్ష హాల్ టికెట్‌తోపాటు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆర్‌సీఓ సూచించారు.

నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం..

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని బీసీ గురుకు ల పాఠశాల విద్యార్థులను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఇతర ప్రాంతాల గురుకులాలను ఇటీవల పంపించారు. దీంతో బుధవారం విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈమేరకు రఘునాథపాలెం, బోనకల్ గురుకులాల ప్రిన్సిపాళ్లు సంజీవరావు, అంజలి పాఠశాలలో తల్లిదండ్రులతో గురువారం సమావేశమయ్యారు. ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను నాలుగు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, విద్యార్థుల నుంచి సమస్యల రాకుండా చూస్తామని తల్లిదండ్రులతో లేఖలు తీసుకున్నట్లు తెలిసింది.

గుడుంబా స్థావరాలపై దాడులు

పెనుబల్లి: మండలంలోని కారాయిగూడెంలో గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారంతో సత్తుపల్లి ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై అల్లూరి సీతారామరాజు, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టగా పలుచోట్ల గుడుంబా స్థావరాలను ధ్వంసం చేశారు. ఈమేరకు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఎస్సై వెంకటేష్, సిబ్బంది నాగరాజు, విల్సన్, శ్రీనివాసులు, ఈసీ.నరసింహారావు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన నిందితుడి రిమాండ్

ఖమ్మంక్రైం: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన పాత నేరస్తుడు పేరెల్లి ప్రవీణ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ ఎస్.వీ.హరికృష్ణ తెలిపారు. ఖమ్మం ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి ముసుగులో దందాలు చేస్తుండగా రౌడీషీట్ కూడా నమోదైంది. ఆయన గంజాయి విక్రయించేందుకు బుధవారం ఖమ్మం పాత బస్టాండ్ సమీపాన వేచిఉండగా ఖమ్మం వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రూ.2.60 లక్షల విలువైన 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయనను రిమాండ్‌కు గురువారం తరలించారు. కాగా, ప్రవీణ్‌పై ఓ హత్య కేసుతో పాటు దోపిడీ, దౌర్జన్యం, హత్యాయత్నం కేసుల్లో నేరాలు రుజువు కావడంతో జీవిత ఖైదు పడింది. ఆతర్వాత సత్ప్రవర్తనతో జైలు నుండి విడుదలయ్యాక మళ్లీ నేరాలకు పాల్పడుతున్నాడు. ఆయనపై ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో 21 కేసులు ఉండగా, రౌడీషీట్ కూడా తెరిచారు. అయితే, ఎవరి భూములకు సంబంధించి వివాదాలు ఉంటే తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించడం, బాధితులపై దౌర్జన్యం చేస్తున్నాడని, ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదని ఏసీపీ హెచ్చరించారు.

రామకృష్ణాపురంలో చోరీ

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గ్రామంలోని అద్దె ఇంట్లో నివాసముంటున్న షేక్ పాషా కుటుంబసభ్యులు ఇంటి ముందు నిద్రించారు. ఈ సమయాన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వెనుక తలుపు తాళాలు పగులగొట్టి బీరువాలో దాచిన సుమారు రూ.43 వేలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం విషయాన్ని గుర్తించిన పాషా ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో ఓ మహిళ మెడలో గొలుసును గురువారం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఖమ్మం సారథినగర్‌కు చెందిన ప్రైవేట్ టీచర్ మాధవీలత ఇంటి సమీపంలోని ఓ హోటల్‌లో టిఫిన్ తీసుకుని వస్తోంది. గుర్తుతెలియని ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వెనుకక నుంచి వచ్చి మెడలో రెండు తులాలకు పైగా ఉన్న బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. దీంతో బాధితురాలు కేకలు వేయగా స్థానికులు చేరుకుని గాలించినా ఆగంతకుల ఆచూకీ తెలియలేదు. దీంతో త్రీటౌన్ పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్య కారణాలతో వివాహిత ఆత్మహత్య

పెనుబల్లి : మండలంలోని కోండ్రుపాడు గ్రామానికి చెందిన వివాహిత రామిశెట్టి అనూష(30) ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు 13ఏళ్ల క్రితం వివాహం జరగగా, పెళ్లి కాకముందే నుంచే ఫిట్స్ వచ్చేవని తెలిసింది. ఇప్పుడు సైతం ఫిట్స్ రావడంతో కడుపునొప్పి బాధిస్తుండగా తట్టుకోలేక ఆమె గురువారం గడ్డి మందు తాగింది. ఈ విషయన్ని గమనించిన భర్త నరేష్, ఆమె పిల్లలు అనూషను పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి ఖమ్మం తీసుకెళ్తుండగా మృతి చెందింది. ఘటనపై ఆమె తల్లి చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వీఎం బంజర్ ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

ఎటూ 'పాలు'పోవడం లేదు..



ఖమ్మంలోని పాడి పరిశ్రమాభివృద్ధి కార్యాలయం

- సంక్షేమ హాస్టళ్లకు నిలిచిన పాల సరఫరా
- పంపిణీదారుడి గడువు ముగిసినా పట్టించుకోని విజయ డెయిరీ
- కొత్త వారి నియామకంలో జాప్యం
- జిల్లా కేంద్రంలో కూడా నిలిచిన పాలు, పెరుగు పంపిణీ

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వ డెయిరీ(విజయ) అధికారుల నిర్లక్ష్యంతో పాలు, పాల పదార్థాల పంపిణీ నిలిచిపోయింది. పంపిణీదారుడి కాలపరిమితి ముగియడం, కొత్త వారిని అప్పగించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, ఏకలవ్య తదితర 62 విద్యా సంస్థలతో పాటు ఖమ్మం నగరంలో సాధారణ ప్రజలకు కలిపి నిత్యం 4,500 లీటర్ల పాల పంపిణీ ఆగింది. జిల్లా కేంద్రంలోని విజయ డెయిరీ వద్ద ఏర్పాటు చేసిన మెగా డెయిరీ పార్లర్ కాంట్రాక్టర్ గడువు సైతం ముగియడంతో పార్లర్ కూడా మూతపడింది.

గత ఏడాది జూలైలో నియామకం

ఏడాదికి ఒకసారి ప్రభుత్వ డెయిరీ యాజమాన్యం పంపిణీదారుడిని నియమిస్తుంది. 2022 జూలైలో ఖమ్మం జిల్లాలోని హాస్టళ్లు, జిల్లాలోని సాధారణ ప్రజలకు పాలు, పదార్థాలు పంపిణీ చేసేందుకు రూ.8 లక్షల వరకు డిపాజిట్ చేయించుకుని బాధ్యతలు అప్పగించారు. సదరు వ్యక్తి కాల పరిమితి ఇటీవల పూర్తికాగా, కొత్త వారి ఎంపిక జరగకపోవడంతో సెప్టెంబర్ 15వ తేదీ వరకు పొడిగించారు. ఆ సమయంలో కూడా ఎంపిక జరగకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, ఖమ్మం నగరానికి పాలు, పాల పదార్థాల సరఫరా ఈనెల 15నుంచి పూర్తిగా ఆగిపోయింది.

త్వరలోనే సమస్యకు పరిష్కారం



పాల పంపిణీలో సమస్య తలెత్తిన మాట వాస్తవమే. ఈనెల 15న పాత కాంట్రాక్టర్ గడువు ముగియగా కొత్తగా ఎవరినీ నియమించలేదు. మూడు ఏజెన్సీల బాధ్యులు దరఖాస్తు చేసుకున్నారు. త్వరలోనే నియామకం చేపట్టనుండగా.. పాలు, ఇతర ఉత్పత్తుల సరఫరా మొదలవుతుంది.

– డాక్టర్ కుమారస్వామి, డీడీ, ప్రభుత్వ పాడి పరిశ్రమ, ఖమ్మం

ఎందుకీ నిర్లక్ష్యం?

రెండున్నర నెలలకు పైగా పంపిణీదారుడి ఎంపికలో డెయిరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. జూలైలోనే కాలపరిమితి పూర్తయినా దృష్టి సారించలేదు. ఇదే డెయిరీ పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పంపిణీదారుడిని మరో ఏడాదికి రెన్యూవల్ చేయడంతో అక్కడ పాల సరఫరా సాఫీగా జరుగుతుంది. అయితే, ఖమ్మం జిల్లాలో మాత్రం ఇన్నాళ్లు పాలు సరఫరా చేసిన వ్యక్తి ఈ ఏడాది ఆసక్తి చూపకపోగా, కొత్త వారిని నియమించడంపై అధికారులు పట్టించుకోలేదు. ఈ కారణంతో సంక్షేమ హాస్టళ్లలో ఇబ్బందులు ఎదురవుతుండగా స్థానికంగా లభించే పాలు, పెరుగు ఏరోజుకా రోజు కొనుగోలు చేసి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు.

అభివృద్ధి పనులపై చర్చ, తీర్మానాలకు ఆమోదం

మధిర: మధిర మున్సిపల్ కార్యాలయంలో గురువారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ మొండితోక లత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే, వివిధ అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు. ఆతర్వాత అజెండాలోనే అంశాలపై కూడా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. తొలుత మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి, ఏఈ నరేష్‌రెడ్డి పట్టణంలో చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ నరేష్‌రెడ్డి